క్లుప్తంగా

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలోని ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామి వారికి పంచామృతాభిషేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక, వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, ఉచిత అన్నప్రసాదం అందజేశారు.

నేడు దేవతామూర్తుల ప్రతిష్ఠ



బలభద్రపురంలో ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని తూర్పు తిరుమలగా పేరొందిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అష్టాదశ శక్తిపీఠ సహిత పరివార దేవత విగ్రహ మహాప్రతిష్ఠ సోమవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నాలుగు రోజులుగా అర్చకులు మిక్కిలి దుర్గయ్యశాస్త్రి ఆధ్వర్యంలో మహంకాళీ వెంకటరామశాస్త్రి బ్రహ్మత్వంలో నిత్యం 41 దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలతో పూజ, ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం 8.56కు ద్వాదశ జ్యోతిర్లింగ సహిత, అష్టాదశ శక్తి పీఠ దేవత సహిత, విద్యా గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, కాలభైరవ, జయవిజయ, నందీశ్వర, చండీశ్వర, మేధా దక్షిణామూర్తి, నవగ్రహ, ధ్వజస్తంభ శిఖర విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుంది. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అలంకరణ చేస్తారు.

రైతుల శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు



లింక్ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న రైతులు

సీతానగరం: మండలంలోని వంగలపూడి రైతుల శ్రమదానంతో వంగలపూడి–పెదకొండేపూడి లింక్ రోడ్డు మరమ్మతులు చేపట్టారు. పాతికేళ్ల క్రితం వంగలపూడి–పెదకొండేపూడి జిల్లా పరిషత్ లింక్ రోడ్డుపై 3.5 కిలోమీటర్లు పొడవున గ్రావెల్ వేశారు. ఇప్పటి వరకు రోడ్డును పట్టించుకోకపోవడంతో రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. రైతులు తమ పంట ఉత్పత్తులను తరలించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పాత నిర్మాణాలు కూల్చివేస్తే ఆ శిథిలాలను స్వచ్ఛందంగా రైతులు తమ ట్రాక్టర్లపై తరలించి గోతులు పూడుస్తున్నారు. అనంతరం పొక్లెయిన్‌తో చదును చేయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి, రోడ్డును పునర్నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు

ఘనంగా అన్న సమారాధన

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం పంచాయతీలోని వెలమపేట రామాలయం వద్ద దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా ఆదివారం అన్న సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ నెల 5న అమ్మవారిని ఘనంగా ఊరేగించి, వంగలపూడి రేవు వద్ద గోదావరిలో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్న సమారాధనలో సుమారు నాలుగు వేల మంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

సీతానగరం: మునికూడలిలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహాన్ని ధర్మవరానికి చెందిన టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ ఆదివారం ఆవిష్కరించారు. రాష్ట్రానికి ఎన్టీఆర్ చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ విమాన శిఖర బ్రహ్మకపాలం మూసివేత

కోరుకొండ: మండలంలోని దోసకాయలపల్లిలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా ఆదివారం ఆలయ విమానశిఖర బ్రహ్మకపాలం మూసివేత జరిగింది. ఉదయం నుంచి పూజలు నిర్వహించిన అనంతరం శాస్త్రోక్తంగా మూసివేత నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సేవలకు బంక్

- కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులదే..
- సక్రమంగా సౌకర్యాలు కల్పించని వైనం
- ఇంధనం బిల్లులోనే వసూలు చేస్తున్న యజమానులు
- అంతగా అవగాహన లేని వినియోగదారులు
- కష్టనష్టాలు ఎదుర్కొంటున్న వాహనదారులు

రాజానగరం: ప్రస్తుత ఆధునిక సమాజంలో ప్రజలు ప్రయాణ సాధనాలుగా మోటార్ సైకిళ్లతో సమానంగా కార్లను వినియోగిస్తున్నారు. వీటితో పాటు రవాణా సదుపాయాలకు ఉపయోగించే బస్సులు, లారీలు, ట్రాక్టర్లు వంటి వాహనాల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. పూర్వం ప్రజలకు ప్రయాణ సాధనమంటే ఎక్కువగా సైకిల్ అనే చెప్పేవారు. ప్రస్తుతం సైకిళ్ల మనుగడే ప్రశ్నార్థకమవుతున్న క్రమంలో ఇంధనంతో నడిచే వాహనాలూ పెరుగుతూ వస్తున్నాయి. వీటికి పెట్రోలు, డీజిల్ ఇంధనాలే ఆధారం. ఇటీవల వీటికి ప్రత్యామ్నాయంగా గ్యాస్, బ్యాటరీతో నడిచే వాహనాలూ వినియోగంలోకి వచ్చాయి. అయితే ఎక్కువ శాతం వాహనాలు ఇంకా పెట్రోలు, డీజిల్‌తోనే నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోలు బంకులు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ దర్శనమిస్తున్నాయి. వినియోగదారులకు కావాల్సిన పెట్రోలు, డీజిల్‌ని ఖరీదుకు అందించే ఈ బంకుల్లో ఉచిత సేవలు కూడా అందించాల్సి ఉంటుంది. ప్రయాణంలో భాగంగా వాహనంలో ఇంధనం (పెట్రోలు, డీజిల్) నింపుకొనేందుకు బంకులకు వచ్చే కస్టమర్లకు కొన్ని కనీస సౌకర్యాలను ఉచితంగా అందించాలి. ఇందుకోసమే ప్రతి లీటరుపై వ్యాట్ రూపంలో వినియోగదారుని నుంచి కొంత రుసుమును వసూలు చేస్తున్నారు. కానీ చాలా బంకుల్లో అటువంటివి కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిపై అవగాహన ఉన్న కస్టమర్లు ప్రశ్నిస్తే, ఆయా బంకుల నిర్వాహకుల నుంచి నిర్లక్ష్య వైఖరే ఎదురవుతోంది. రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో ఉన్న అనేక గ్రామాల పరిధిలో నేషనల్ హైవే, ఏడీబీ రోడ్డు విస్తరించి ఉంది. ఆయా ప్రధాన మార్గాల్లో వందల సంఖ్యలో పెట్రోల్ బంకులు కొనసాగుతున్నాయి. నిత్యం వందలాది ప్రయాణికులు వేలాది వాహనాల్లో ప్రయాణిస్తూ, ఇంధనం కోసం ఆయా బంకులను ఆశ్రయిస్తున్నారు.

అవగాహన ఉండాలి



పెట్రోలు బంకుల్లో అందించాల్సిన ఉచిత సేవలపై కస్టమర్లకు పూర్తి అవగాహన ఉండాలి. అప్పుడే వాటిపై ప్రశ్నించగలుగుతారు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రతి బంకులోనూ తాగునీరు, మరుగుదొడ్లు, ఎయిర్ ఫిల్లింగ్ తదితర సదుపాయాలను ఉచితంగా అందించాల్సి ఉంది. ఇందుకు వినియోగదారుడు ప్రతి లీటరుకు చెల్లించే మొత్తం నుంచి వ్యాట్ టాక్స్ వసూలు చేస్తున్నారు. ఈ విషయం తెలియకపోవడం వల్లే బంకుల్లో ఈ సేవలు కొరవడుతున్నాయి.

– సత్తి త్రిమూర్తులు, వినియోగదారుడు



రాజానగరంలోని ఓ పెట్రోలు బంకు

ఉండాల్సిన సదుపాయాలివే..

- పెట్రోలు, డీజిల్ కోసం బంకులకు వచ్చే కస్టమర్లకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండాలి. పరిశుభ్రమైన మరుగుదొడ్లు, మూత్రశాలలు కచ్చితంగా నిర్వహించాలి.
- ప్రతి పెట్రోలు బంకులోను కస్టమర్ల వాహనాల కోసం ఎయిర్ ఫిల్లింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలి. వాహనంలో గాలి చెక్ చేసి, నింపడానికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలి. ఇటీవల కాలంలో ట్యూబ్ లెస్ టైర్ల వినియోగం పెరుగుతుంది. ఈ క్రమంలో గాలికి బదులుగా నైట్రోజన్‌ని నింపే సదుపాయాన్ని కల్పించాలి.
- అత్యవసర సమయాల్లో వినియోగదారులకు బంకుల్లో ఫోన్ సదుపాయాన్ని కూడా అందించాల్సి ఉంటుంది. ప్రయాణించే మార్గంలో ఎక్కడైనా అనుకోని సమస్యల్లో చిక్కుకుంటే, ఆ సమయంలో సెల్‌ఫోన్ అందుబాటులో లేకుంటే, సమీపంలో ఉన్న పెట్రోలు బంకులో ఫోన్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.
- పెట్రోలు, డీజిల్ నాణ్యత ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులకుంది. దీనిని బంకు యజమానులు నిరాకరించడానికి వీలులేదు. క్వాలిటీ చెక్ టిష్యూ పేపరును ఆయా బంకు యాజమాన్యం అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఫోన్ నంబరును డిస్‌ప్లే చేయాలి.
- ప్రతి బంకులోనూ కంప్లైంట్ రిజిస్టర్, బాక్స్‌తో పాటు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలి. ఇందులో ప్రథమ చికిత్సకు అవసరమైన గడువు తీరని మెడిసిన్స్ ఉంచాలి.
- ఏ బంకులోనైనా కస్టమర్లకు మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకున్నా, యాజమాన్యం నుంచి సరైన సమాధానం రాకున్నా వెంటనే ఆయా బంకు నిర్వాహకులపై చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.

పేదల వైద్యంపై నిర్లక్ష్య ధోరణి

వైఎస్సార్ సీపీ వలంటీర్ల విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ బాబు



సీతానగరం: రాష్ట్రంలోని పేద ప్రజలకు అందించే వైద్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని వైఎస్సార్ సీపీ వలంటీర్ల విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్ బాబు) ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేద ప్రజల ఆరోగ్యంపై ఏ మాత్రం శ్రద్ధ తీసుకోకపోగా, వారికి అందించాల్సిన వైద్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసి, 2014–19 టీడీపీ ప్రభుత్వ హయాంలోని బకాయిలను చెల్లించి, పేద ప్రజలకు అందాల్సిన సేవలు కొనసాగేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలనూ చెల్లించకుండా వైద్య సేవలు నిలిచిపోయేలా వ్యవహరించడం సబబు కాదన్నారు. భవిష్యత్తులో మారుమూల పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 కొత్త మెడికల్ కాలేజీలతో పాటు, ఆసుపత్రులు తీసుకొస్తే, కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఆరోగ్యశ్రీ పెండింగ్ బకాయిలు చెల్లించి, పేద ప్రజల ఆరోగ్య సేవలపై చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. అలాకాని పక్షంలో ప్రజల నిరసన చవిచూడక తప్పదని హెచ్చరించారు.

దైవ నామస్మరణతో ఆధ్యాత్మిక చింతన



పాత వీరంపాలెం రామాలయంలో భజన చేస్తున్న భక్తులు

రంగంపేట: నిరంతర దైవనామస్మరణ ద్వారా ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సత్యసాయి భజన మండలి కన్వీనర్ నాగులపల్లి భాస్కరరావు అన్నారు. ఆదివారం పాత వీరంపాలెం గ్రామంలోని కోదండ రామాలయంలో భగవాన్ సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల సందర్భంగా 12 గంటల భజన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా పురుష సేవాదళ సమన్వయకర్త తికిశెట్టి గోవిందరాజులు, ఈలకొలను సేవా సమితి కన్వీనర్ తిక్కిశెట్టి సుబ్బారావు, బాలవికాస్ గురువులు చక్రధర్, దేవి, భవాని, సేవాదళ్ సభ్యులు సహదేవుడు, సత్యవాణి, హైమావతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో భాగంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యామ్‌సుందర్ అన్నారు. రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులంలో ఆదివారం రక్తదాన శిబిరం, లిక్విడ్ లవ్ యాప్‌లో నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ, బాబా బోధించిన అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు సూక్తిని అనుసరించాలన్నారు. ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ, కార్యక్రమంలో 101 మంది రక్తదానాన్ని, 112 మంది లిక్విడ్ లవ్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్నారని వివరించారు. రక్తదాన శిబిరంలో 83వ సారి రక్తదానం చేసిన హుకుంపేటకు చెందిన సామాజిక కార్యకర్త కొవ్వూరి ధర్మారెడ్డిని శాలువాతో సత్కరించారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే బాసట



అనపర్తిలో సీఐ సుమంత్‌తో చర్చిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాయవరం శ్రీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో అనపర్తికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం ప్రకటించకపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన అనపర్తికి చెందిన చిట్టూరి యామిని ఆదివారం మృతి చెందారు. రోజులు గడుస్తున్నా సహాయం ప్రకటించడానికి ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన నాయకులు పోలీసులను నిలదీశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వెంటనే మృతురాలి ఇంటి వద్దకు చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణతో దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఎస్పీ నరసింహ కిషోర్, స్థానిక సీఐ వీఎల్‌వీకే సుమంత్‌తో వారు సంప్రదించి, బాధిత కుటుంబాల ఆవేదనను వారికి వివరించారు. ఈ క్రమంలో అధికారులు ఐదు రోజుల గడువు కోరడంతో, గ్రామానికి చెందిన నాయకులు శాంతించారు. అనంతరం మృతదేహానికి బంధువులు అంత్యక్రియలు పూర్తి చేశారు. అలాగే మహాలక్ష్మిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పుండరీ వాసు(ఉల్లిపాయల శ్రీను), డాక్టర్ సూర్యనారాయణరెడ్డి సమక్షంలో లక్ష్మీగణపతి ఫైర్‌వర్క్స్ యజమాన్యంతో నష్ట పరిహారంపై చర్చించి హామీ పొందారు. బాధితులకు బాసటగా నిలిచిన డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

చదివిన పాఠశాలలోనే టీచర్

మండలంలో 16 మందికి ఉపాధ్యాయ పోస్టులు



గారపాటి భారతి, రంగంపేట



సోడసాని గంగాధర్, జి.దొంతమూరు



పోతుల రాజశేఖర్, ముకుందవరం



తిక్కిశెట్టి రాంబాబు, ఈలకొలను



కంటిపూడి వనజ, చంద్రేడు

రంగంపేట: తాను విద్యాభ్యాసం చేసిన స్కూల్‌లోనే పాఠాలు బోధించనుంది. తాజా డీఎస్సీలో ఉపాధ్యాయురాలి ఎంపికైన గారపాటి భారతి తాను చదివిన రంగంపేట హైస్కూల్‌లోనే ఆంగ్ల భాషోపాధ్యాయురాలిగా పిల్లలకు చదువు చెప్పనుంది. ఈ ఏడాది నిర్వహించిన మెగా డీఎస్సీ–2025లో విశేష ప్రతిభను చాటి 16 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ఈ నెల 13వ తేదీన ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నారు. రంగంపేట గ్రామానికి చెందిన గారపాటి ప్రసాద్ కుమార్తె భారతి ఐదో ర్యాంకును సాధించి తాను చదివిన రంగంపేట హైస్కూల్‌లోనే స్కూల్ అసిస్టెంట్ ఆంగ్ల భాషోపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టనుంది. చంద్రేడు గ్రామానికి చెందిన కంటిపూడి రామదేవుడు కుమార్తె వనజ 43వ ర్యాంకును సాధించి స్కూల్ అసిస్టెంట్ గణిత శాస్త్రం టీచర్‌గా ఏలేశ్వరం మండలం లింగంపర్తి హైస్కూల్లో బాధ్యతలు చేపట్టనుంది. జి.దొంతమూరు గ్రామానికి చెందిన సోడసాని నాగేశ్వరరావు కుమారుడు గంగాధర్ 26 ర్యాంకును సాధించి ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా వెంకటాపురం యూపీ స్కూల్లో జాయిన్ కానున్నారు. వెంకన్నపేట గ్రామానికి చెందిన పొన్నాడ రామచంద్రరావు కుమార్తె వీఆర్ వరలక్ష్మి 78వ ర్యాంకును సాధించి స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా మండపేట గొల్లపుంత మున్సిపల్ హైస్కూల్లో బాధ్యతలు చేపట్టనుంది. ఈలకొలను గ్రామానికి చెందిన తిక్కిశెట్టి నాగేశ్వరరావు కుమారుడు రాంబాబు 32 ర్యాంకును సాధించి స్కూల్ అసిస్టెంట్ గణిత శాస్త్ర ఉపాధ్యాయునిగా ఇరిపాక హైస్కూల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. సింగంపల్లి గ్రామానికి చెందిన పడాల వీరబాబు 143 ర్యాంకును సాధించి రంగంపేట హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయునిగా పనిచేయనున్నారు. వడిశలేరు గ్రామానికి చెందిన జునిపే కామరాజు కుమార్తె దేవీసత్యవేణి 156 ర్యాంకును సాధించి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులుగా మల్లేపల్లి హైస్కూల్లో జాయిన్ కానున్నారు. దొడ్డిగుంట గ్రామానికి చెందిన మల్లిపూడి ప్రభాకరరావు కుమార్తె మౌనిక 66 ర్యాంకును సాధించి హిందీ ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టనున్నారు. జి.దొంతమూరు గ్రామానికి చెందిన గిరిజాల వెంకటరమణమూర్తి కుమారుడు ప్రసాద్ 180 ర్యాంకును సాధించి రంపచోడవరం మండలంలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆ ప్రత్యేకతే వారిని జీవితంలో తీర్చిదిద్దింది



సత్యంశెట్టి మణికంఠ

చిన్నదొడ్డిగుంట గ్రామానికి చెందిన సత్యంశెట్టి మణికంఠ ప్రత్యేక అవసరాల విద్యార్థిగా రంగంపేట భవిత కేంద్రంలో చదివారు. హెచ్ఐ విభాగంలో మూడో ర్యాంకును సాధించి, వీఆర్ పురం మండలం ఇప్పుడు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టనున్నారు. దొడ్డిగుంట గ్రామానికి చెందిన యాగ వెంకట సుబ్బారావు 188 ర్యాంకును సాధించి లాలాచెరువు జెడ్పీహెచ్ స్కూల్లో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టనున్నారు. చంద్రేడు గ్రామానికి చెందిన మల్లవరపు నారాయుడు కుమారుడు సోమరాజు 152 ర్యాంకు సాధించి సోషల్ అసిస్టెంట్ టీజీటీగా జూన్ 2లో జాయిన్ కానున్నారు.



దేవిశెట్టి రోజారాణి

సింగంపల్లి గ్రామానికి చెందిన దేవిశెట్టి రోజా రాణి అంధత్వాన్ని అధిగమించింది. నాలుగో ర్యాంకును సాధించి కాకినాడ జగన్నాథపురం మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టనుంది. దొడ్డిగుంట గ్రామానికి చెందిన వార యోసేపు రాజు కుమారుడు అశోక్ కుమార్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా ముకుందవరం జెడ్పీ హైస్కూల్లో జాయిన్ కానున్నారు. ముకుందవరం గ్రామానికి చెందిన పోతుల రాజశేఖర్ 14 ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా జి.దొంతమూరు హైస్కూల్లో చేరనున్నారు. అలాగే సింగంపల్లి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి గోవిందు కుమార్తె మహాలక్ష్మి 233 ర్యాంకు సాధించి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా కాట్రేనికోన మండలం కొత్తపాలెం ప్రాథమిక పాఠశాలలో జాయిన్ కానున్నారు. వీరందరికీ ఈ నెల 19న అనపర్తిలో ఘన సత్కారం చేయనున్నారు.

15న ఆలయ ప్రతిష్ఠ

కోరుకొండ: బూరుగుపూడి గ్రామ శివారునున్న వల్లీ, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద రెండో రోజు ఆదివారం హోమం జరిగింది. ఈ నెల 15న స్వామివారి ఆలయ ప్రతిష్ఠ జరుగుతోంది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఐదు రోజుల పాటు హోమాలు నిర్వహిస్తున్నారు.

వ్యక్తి నిర్మాణమే లక్ష్యం

సీతానగరం: సమాజంలో వ్యక్తి నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని సంఘ కోరుకొండ ఖండ సహ కార్యవాహ సుధాకర్ అన్నారు. ఆదివారం సీతానగరం శివాలయంలో విజయదశమి కార్యక్రమాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ విభాగ్ బండ్ల గణేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం

సీటీఆర్ఐ: వాగ్దేవి కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక తాడితోట సంహిత డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం సహస్రావధాన భాస్కర గడా కడిమిళ్ల వరప్రసాద్ చేసిన అవధానం అలరించింది. ప్రవచన రాజహంస డాక్టర్ ధూళిపాళ మహదేవమణి సంచాలకత్వం వహించారు. నిషిద్ధాక్షరి సురభి శంకరశర్మ, సమస్య టీఎం భ్రమరాంబిక, వర్ణన వేదాల గాయత్రీదేవి, దత్తపది ముసుకుట్ల వేంకట సూర్యనారాయణమూర్తి, ఆశువు నాగులపాటి మహతి తేజశ్రీ, వ్యస్తపాది డాక్టర్ ప్రభల శ్రీవల్లి, పురాణపఠనం ఘట్టి కృష్ణమూర్తి, అప్రస్తుత ప్రసంగం డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి, జోరా శర్మ పృచ్ఛకులుగా వ్యవహరించారు. వాగ్దేవి కళా పీఠం వ్యవస్థాపకులు వెంపరాల వేంకట లక్ష్మీశ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అవధానిని, పృచ్ఛకులను సత్కరించారు.

ప్రాచీన కళలకు పూర్వ వైభవం

- వేల ఏళ్ల క్రితమే విస్తరించిన భారతీయ విజ్ఞానం
- పాశ్చాత్యం వైపు నేటి తరం పరుగులు
- ప్రాచీన భారత జ్ఞాన పునరుజ్జీవనంపై అంతర్జాతీయ సదస్సు
- 14, 15 తేదీల్లో ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహణ
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పాల్గొననున్న ప్రముఖులు



ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రాచీన కళలకు భారతదేశం పుట్టినిల్లు. ఈ పవిత్ర దేశంలో ఎన్నో గ్రంథాలు, వేదాలు, శాస్త్రాలు ఉద్భవించాయి. ఎన్నో అద్భుత గ్రంథాలు అందించబడ్డాయి. కానీ, వాటిని వదిలి పాశ్చాత్య విధానాల వైపు యువత పరుగులు తీస్తోంది. వాతావరణ మార్పులు, మానసిక ఒత్తిడి, అస్థిర జీవనశైలి, పర్యావరణ క్షీణత, సామాజిక అసమానతలు, ఆరోగ్య సంక్షోభాలు తప్పడం లేదు. వేల సంవత్సరాల క్రితం అభివృద్ధి చెందిన జ్ఞానం కేవలం చారిత్రక ఆసక్తికి మాత్రమే పరిమితం కాకుండా, సమకాలీన సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తోంది.

యోగా, ధ్యానం

ఆధునిక ప్రపంచంలో మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, జీవనశైలి రోగాలు భయంకరమైన స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 280 మిలియన్ల మంది డిప్రెషన్‌తో బాధపడుతున్నారు. ఈ సందర్భంలో ప్రాచీన భారతీయ యోగా, ధ్యాన పద్ధతులు అద్భుతమైన పరిష్కారాలను అందిస్తున్నాయి. హార్వర్డ్ మెడికల్ స్కూల్ చేసిన అధ్యయనాలు.. **ధ్యానం మెదడు నిర్మాణంలోనే మార్పులు తెస్తుందని నిరూపించాయి. యూరోపియన్ దేశాలు, అమెరికాలో యోగా శిక్షణా కేంద్రాలు వేగంగా పెరుగుతున్నాయి. ఐక్యరాజ్య సమితి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించడం దీని ప్రాముఖ్యానికి నిదర్శనం.**

సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుర్వేదం

ప్రపంచం రోగాలతో సతమతమవుతున్నపుడు మన దేశంలో ఆయుర్వేదం ద్వారా అనేక దీర్ఘకాలిక రోగాలను నయం చేసేవారు. ఆధునికత వైపు అడుగులు వేసి దేశీయ ఆయుర్వేదాన్ని వదిలేయడంతో దేశంలో అనేక లక్షల మంది అనేక రోగాలతో బాధలు పడుతున్నారు. దానికి కారణం శరీరతత్వానికి చెందిన జ్ఞానం లేకపోవడం, విదేశీవైద్యం వైపు పరుగులు పెట్టడమే.

సుస్థిర నిర్మాణాలకు వాస్తు శాస్త్రం

ప్రాచీన భారతీయ విధానమైన వాస్తు శాస్త్రం పర్యావరణ అనుకూల నిర్మాణ సూత్రాలను అందిస్తుంది. సహజ వెలుతురు, గాలి ప్రసరణ, ఉష్ణోగ్రత నియంత్రణ, శక్తి సామర్థ్యంపై దృష్టి పెడుతుంది. కోణార్క్ సూర్య మందిరం, చార్మినార్, హంపీ నిర్మాణాలు వాస్తు సూత్రాలను అనుసరించి నిర్మించబడ్డాయి. సహజ శీతలీకరణ, వెలుతురు వ్యవస్థలను కలిగి ఉన్నాయి. ఆధునిక ఆర్కిటెక్ట్‌లు ఈనాటి హరిత భవనాల రూపకల్పనలో ఈ సూత్రాలకు ప్రాధాన్యమిస్తున్నారు.

అంతర్జాతీయ సదస్సు

సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం నడయాడిన నేలపై ప్రాచీన భారత జ్ఞాన పునరుజ్జీవనంపై అంతర్జాతీయ సదస్సు ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పాల్గొనున్నారు. అనేక మంది పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులు, విభిన్న రంగాల్లో ప్రతిభావంతులు తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. పురాతన భారతీయ జ్ఞాన సంపద అనేది నేటి ప్రపంచ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందించే శక్తివంతమైన సాధనంగా తెలియజెప్పడమే ఈ సదస్సు ముఖ్యోద్దేశం.